

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ముత్తంపేటలో కౌటాల- సిర్పూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

# అన్నదాతల ఆగ్రహం

తడిసిన ధాన్యం కొనాల్సిందేనని డిమాండ్

## మొలకెత్తిన వడ్లతో ఆందోళన • ధర్మపురి- జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా

జగిత్యాల రూరల్/ రాయికల్, మే 23 : కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావు పేట ఐకేసీ సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు మొలకెత్తిన ధాన్యంతో ధర్మపురి జగిత్యాల ప్రధాన రహదారిపై నిర్వహించారు. అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్, ఎస్‌ఐ సదాకర్ చేరుకొని రైతులకు సర్ది చెప్పినా ససేమిరా అనడంతో అదనపు కలెక్టర్ బీఎస్ లత ధర్నా వద్దకు చేరుకున్నారు. ధాన్యం ఆరబెట్టిన తర్వాత కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రాయికల్ మండలం సింగారావుపేట- శ్రీరామ్‌నగర్ గ్రామాల రైతులు సింగర్‌రావుపేట- జగిత్యాల రహదారిపై బైఠాయించారు. రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. తహసీల్దార్ గణేశ్ చేరుకొని రైతులతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు కొనుగోళ్లు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అకాల వర్షాలకు తడిసిన ధా న్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు.



జగిత్యాల అర్బన్ మండలంలోని గోపాల్‌రావుపేటలో ధర్మపురి- జగిత్యాల ప్రధాన రహదారిపై మొలకెత్తిన ధాన్యం పోసి ధర్నా చేస్తున్న రైతులు



నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్‌లో ప్రధానరహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

### నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని గోవింద్‌పేట్ చౌరస్తా వద్ద ధాన్యం సంచులతో శుక్రవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. అకాల వర్షాలకు చేతికొచ్చిన పంట తడిసిపోయి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్డీవో రాజాగౌడ్ అక్కడికి చేరుకుని సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని భరోసా ఇవ్వడంతో రైతులు శాంతించారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సిబ్బందితో వచ్చి క్లియర్ చేశారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

కౌటాల: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట, సిర్పూర్(టీ) పారిగాం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ముత్తంపేటలోని కౌటాల-సిర్పూర్ ప్రధాన రహదారిపై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధర్నా చేయడంతో ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అక్కడికి చేరుకుని రైతులకు మద్దతుగా రాస్తారోకోలో కూర్చున్నారు. రైతు కష్టాల గురించి కలెక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదనపు కలెక్టర్ డేవిడ్ పారిగాం, ముత్తంపేట వరి కొనుగోలు కేంద్రాల వద్దకు చేరుకుని తడిసిన వడ్లను పరిశీలించారు. వారంలోగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, ఇతర పార్టీల నాయకులు రైతులకు మద్దతు పలికారు.

### నిర్మల్ జిల్లాలో రోడ్డెక్కిన అన్నదాతలు

ఖానాపూర్ రూరల్: తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్‌లోని గోసంవాడ వద్ద మెట్‌పెల్లి ప్రధాన రహదారిపై సుర్జాపూర్, బాదనకుర్తి, మేడంపెల్లి గ్రామాల రైతులు ధర్నా చేపట్టారు. గంట వరకు ధర్నా కొనసాగగా తహసీల్దార్ ఘటనా స్థలానికి చేరుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

- **ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కల్లాల్లో ధాన్యం నీటిపాలు**
- **తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకుల డిమాండ్**

*హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల దగ్గర తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. యాసంగి సీజన్‌లో 56 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని ప్రభుత్వ అధికారులు అంచనా వేశారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి సాగర్ తెలిపారు. కానీ అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. నెల కిందనే కోతలు పూర్తి చేసుకుని రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చినా అధికారులు 15 రోజుల వరకు తూకాలు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు పూర్తయినా సకాలంలో లారీలు రాలేదని, అందుకే ధాన్యాన్ని మిల్లులకు పంపలేదని ప్రభుత్వ పెద్దలు, అధికారులు సాకులు చెప్తున్నారని రైతు సంఘం నాయకులు పోతినేని సుదర్శన్ రావు, సాగర్ మండిపడ్డారు. బాధ్యులైన కాంట్రాక్టర్ల మీద ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. మరోవైపు కొనుగోలు కేంద్రాలలో 40 కేజీల బస్తాకు 2 కేజీల చొప్పున తరుగు తీస్తున్నారని, నిబంధనల ప్రకారం 700 గ్రాములు మాత్రమే తరుగు తీయాలని చెప్పారు. మిల్లుకెళ్లిన తర్వాత మరోసారి తరుగు తీయడమేంటని ప్రశ్నించారు. రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారని చెప్పారు.*

## తడిసిన వడ్లకు దిక్కెవరు?

మొదటిపేజీ తరువాయి...

కష్టపడి పండించిన పంట కండ్ల ముందే నాశనమవుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని ఓ వైపు ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తుంటే.. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్య రాశు లు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం చెప్పిన కొనుగోళ్లు ఏ మేరకు నిజమనే ప్రశ్న లు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్త మ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. కానీ, వాస్తవానికి 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నదని, ఈ లెక్కన ప్రభుత్వం ఇంకా 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు చెప్తున్నారు.

### మంత్రి మాటలు ఉత్తవేనా?

ఇటీవల కురిసిన వర్షాలతో కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపిస్తున్నాయి. ధాన్యం కుప్పలన్నీ నీళ్లలో మునిగి తడిసిపోయాయి. తడిసిన ధాన్యం కొనుగోలుకు అధికారులు ససేమిరా అంటున్నారు. ఆ ధాన్యం నల్లగా ఉన్నదని, మిల్లింగ్‌కు పనికిరాదని చెప్తున్నట్టు తెలిసింది. కొన్ని చోట్ల బలవంతంగా కొనుగోలు చేసినప్పటికీ మిల్లులకు వెళ్లాక ఆ ధాన్యాన్ని మిల్లర్లు తీసకోవడం లేదు. ఒకవేళా తీసుకున్నా క్వింటాలుకు 10-20 కేజీల కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ధాన్యం తడిసిపోయిందని, నల్లగా ఉన్నదని కోతలు పెడుతున్నట్టు ఆరోపిస్తున్నారు. మరోవైపు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రతి గింజా కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ, తడిసిన ధాన్యాన్ని కొనేదే లేదంటూ క్షేత్రస్థాయిలో అధికారులు తెగేసి చెప్తున్నారు. దీంతో మంత్రి మాటలన్నీ ఉత్తవేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### నాడు కేసీఆర్ భరోసా

గతంలోనూ యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు సమయంలో అకాల వర్షాలు కురిశాయి. కానీ, అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించారు. తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకే కొనుగోలు చేయించారు. అలా ప్రతి సీజన్‌లో సుమారు 5 లక్షల టన్నులకు పైగా తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయించి రైతులకు భరోసా కల్పించారు. ఆ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో రైతులను పట్టించుకునే నాథుడే లేకపోయాడు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించలేదు. కనీసం ఆ దశగా ఒక్క ప్రకటన కూడా జారీచేయలేదు. మరోవైపు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండి ప్రకటనలకే పరిమితమవుతున్నారు. దీంతో రైతుల గోస పట్టించుకునేవారు కరువయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఇక్రిశాట్‌ను సందర్శించిన రైతు కమిషన్ బృందం

హైదరాబాద్, మే 23 (నమస్తేతెలంగాణ): ఇక్రిశాట్‌ను శుక్రవారం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితోపాటు వ్యవసాయ అధికారులు హరి వెంకటప్రసాద్, సురేశ్‌తోకూడిన బృందం సందర్శించింది. ఇక్రిశాట్‌లో చేపడుతున్న కార్యక్రమాలను బృందం అడిగి తెలుసుకుంది. మెట్ట పంటల అభివృద్ధి, విత్తన పరిశోధన, మట్టి ఆరోగ్యం, నీటి వినియోగం అంశాలపై చర్చించింది. రైతు కమిషన్ అభిప్రాయాలు, ప్రభుత్వ పాలసీలను ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు ప్రతినిధులకు వివరించారు. ఇక్రిశాట్‌లో జరుగుతున్న కార్యక్రమాలు, పరిశోధనలను రైతుకమిషన్ బృందానికి ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా హిమాన్షు పతక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా స్టాన్‌ఫర్డ్ బ్లేడ్, ప్రిన్సిపల్ సైంటిస్టులు డా హరికిషన్ సూదిని, డా జానిలా వివరించారు.

## జూన్ 2 నుంచి విత్తన వారోత్సవాలు

- **అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తాం**
- **వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య**

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన వారోత్సవాలలో భాగంగా విత్తన పంపిణీకి రంగం సిద్ధం చేసింది. జూన్ 2న పంపిణీ ప్రారంభించనున్నట్టు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి ముగ్గురి నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన సంచులను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. జూన్ 3వ తేదీ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయ కేంద్రాల్లో వరి, కంది, మక్క, పెసర, మినుము, ఆముదం, చిరుధాన్యాలకు సంబంధించిన 8,500 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీకి సిద్ధంగా ఉంచినట్టు అల్దాస్ జానయ్య వివరించారు.

### విత్తన పంపిణీ కేంద్రాల వివరాలు

| పంపిణీ కేంద్రం | పంట | ఫోన్‌నంబర్లు |
|---|---|---|
| వ్యవసాయ పరిశోధనా కేంద్రం-రాజేంద్రనగర్ | వరి, మక్క | 9440225385 |
| విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం-రాజేంద్రనగర్ | వరి | 8639975840 |
| ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం-పాలెం | వరి, జొన్న, కంది, ఆముదం | 9705069580 |
| వ్యవసాయ పరిశోధనా కేంద్రం-కంపాసాగర్ | వరి | 9492396001 |
| వ్యవసాయ పరిశోధన స్థానం-తాండూర్ | కంది, జొన్న, కుసుమ | 9885040499 |
| ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం-వరంగల్ | వరి, కంది, పెసర | 9010756465 |
| ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం-మధిర, కేవీకే-వైరా | వరి, పెసర, మినుము వరి | 9652204006 |
| వ్యవసాయ పరిశోధనస్థానం-తోర్నాల | వరి | 9849822270 |
| ప్రాంతీయ వ్యవ1సాయ పరిశోధనా స్థానం, జగిత్యాల | వరి, నువ్వులు | 9701592326 |

## రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): అరేబియా మహాసముద్రంలో కొనసాగుతున్న అల్పపీడనం, ఈ నెల 27న పశ్చిమ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండటంతో తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, ములుగు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఆయా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అటు ఏపీలోనూ రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అరేబియా మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశముందని ఐఎండీ అధికారులు వెల్లడించారు. వాయుగుండం తీవ్రవాయుగుండంగా లేదా తుఫాన్‌గా బలపడవచ్చని చెప్పారు. కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నదని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో అత్యధికంగా 12.51 సెంటీ మీటర్ల వర్షం కురిసినట్టు పేర్కొన్నది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

## అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు శాపం

కురవి, మే 23 : అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నది. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా అయిన బస్తాల్లోని వడ్లు వర్షానికి తడిసి మొలకలెత్తాయి. బాదావత్ యుగేందర్ అనే రైతుకు చెందిన ధాన్యం కాంటా అయిన బస్తాలను టార్పాలిన్లు పెట్టి నిల్వ ఉంచారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ఓడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వడ్ల బస్తాలు మొలకెత్తాయి. ఓ రైతు 15 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకురాగా, ఐదు రోజుల క్రితం కాంటాలు పెట్టారు. తరలింపులో జాప్యం చేయడంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది. మరి కొంత ధాన్యం కొనుగోలు కేంద్రంలో నింపిన బస్తాల్లోనే మొలకెత్తింది.



జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ కొనుగోలు కేంద్రంలో ట్రాక్టర్‌లో మొలకెత్తిన ధాన్యం

### వడ్లకు మొలకలు..ఆందోళనలో రైతులు

వేల్పూర్/ముప్కాల్: బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్, ముప్కాల్ మండలాల్లో కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోయి, మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రంలో విక్రయించడానికి రోడ్లపై ఆరబోసిన వడ్లకు మొలకలు వచ్చాయని వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన తాల్కల చిన్న రాజన్న ఆవేదన వ్యక్తంచేశాడు. వరుసగా కురుస్తున్న వర్షాలకు వడ్లకు మొలకలు వస్తున్నాయని ముప్కాల్ మండలానికి చెందిన దండుగుల పోశెట్టి అనే కౌలు రైతు వాపోయాడు. అటు ప్రభుత్వం, ఇటు సీడ్ ఇచ్చిన వారు కూడా ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

### ఇష్టం ఉంటే ఉంచు.. లేకుంటే తీసుకెళ్లు

ఆత్మకూర్.ఎస్: 'ఇష్టముంటే కేంద్రంలో ఉంచు.. లేకపోతే ధాన్యాన్ని తీసుకెళ్లు' అంటూ ఐకేపీ కేంద్రం నిర్వాహకులు హుకూం జారీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఏపూరు గ్రామానికి చెందిన రైతులు ఐకేపీ కేంద్రానికి ధాన్యం తెచ్చి ఇబ్బంది పడుతున్నారు. కేంద్రంలో సరిపడా గోనెసంచులు లేవని, కాంటాలు వేయకపోవడంతో అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. తమకు నచ్చిన వారి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, తమ ధాన్యం రెండు నెలలైనా కొనుగోలు చేయలేదని విలపించారు. పండించిన పంట ఒక ఎత్తు అయితే, పంటను అమ్మాలంటే ఇంత కష్టపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

జడ్చర్ల టౌన్, మే 23 : జడ్చర్ల మండలం గోప్లాపూ ర్‌లో మధుసూదన్‌రెడ్డి ఇంట్లో 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలను శుక్రవారం వ్యవసాయ, పోలీసుశాఖ అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.75వేలు ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకొని పో లీస్‌స్టేషన్‌కు తరలించామని సీఐ కమలాకర్, వ్యవసాయ శాఖ అధికారులు కృష్ణకిశోర్, వెంకటేశ్, గోపీనాథ్ తెలిపారు.




మరిన్ని వార్తలు ntnews.comలో చూడగలరు





**TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH**
(Autonomous Institution of the Department of Atomic Energy, Government of India)
Survey No.36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyderabad - 500046. Website: www.tifrh.res.in

**Advertisement No.2025/02**

Applications are invited for the following posts tenable at Hyderabad. Please visit our website for application details and prescribed requirements **https://recruitment.tifrh.res.in/applicants/**

| Sr. No. | Name of the Post | Reservations | | | | | | Age Max. | Pay Level and Pay Stage as per 7th CPC Pay Matrix | TME (Rs.) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | UR | SC | ST | OBC | PwBD | EWS | | | |
| 1. | Scientific Officer (D) - IT | 1 | - | - | - | - | - | 35 | Pay Level-11; Pay Stage 1 | Rs.1,36,405/- |
| 2. | Scientific Officer (D) | 1 | - | - | - | - | - | 35 | Pay Level-11; Pay Stage 1 | Rs.1,36,405/- |
| 3. | Scientific Officer (D) | 1 | - | - | - | - | - | 35 | Pay Level-11; Pay Stage 1 | Rs.1,36,405/- |
| 4. | Scientific Officer (D) | 1 | - | - | - | - | - | 35 | Pay Level-11; Pay Stage 1 | Rs.1,36,405/- |
| 5. | Project Scientific Officer (C) | 1 | - | - | - | - | - | 28 | Consolidated Pay Rs.1,00,600/- (Including HRA ) | |
| 6. | Project Junior Engineer (B) -Civil | 2 | - | - | - | - | - | 28 | Consolidated Pay Rs. 62,200/- (Including HRA) | |
| 7. | Project Junior Engineer (B) - Electrical | 1 | - | - | - | - | - | 28 | Consolidated Pay Rs. 62,200/- (Including HRA) | |
| 8. | Administrative Assistant (B) | 1 | - | - | - | - | - | 33 | Pay Level-6; Pay Stage 1 | Rs.71,070/- |

Online applications must be submitted on (or) before **June 13, 2025** and applications by post must reach to the Head, Admin & Finance, Tata Institute of Fundamental Research, Survey No.36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyderabad - 500046 on (or) before **June 13, 2025.** Applicants who are required to send the applications by post must super scribe the post applied for, advertisement no. & serial number of the post on the envelope.

Sd/- Head, Admin & Finance